
ప్రజాశక్తి
గురువారం 8 డిసెంబర్ 2022
5
శ్రీ సత్యసాయి



జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జేఎన్టీయూ పరిధిలో బిటెక్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య కేశవరెడ్డి, పరీక్షల విభాగం కంట్రోలర్ బి.చంద్రమోహన్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీ పరిధిలో నిర్వహించిన బిటెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్, బిటెక్ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ సప్లిమెంటరీ, మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష, బిటెక్ ఒకటవ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష, ఎంటెక్ ఒకటవ సెమిస్టర్ సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ ఒకటవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్, ఎంసిఎ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, ఎంసిఎ రెండవ సెమిస్టర్ (ఆర్ 20), (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంసిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21), (ఆర్ 20), (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంబిఎ రెండవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, ఎంబిఎ రెండవ సెమిస్టర్ (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంబిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ, ఎంబిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 17) సప్లిమెంటరీ పలితాలను విడుదల చేశామని చెప్పారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్ సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

వారు సచివాలయంలో ఉండరు..!



హిందూపురం 43వ సచివాలయంలో సెక్రటరీలు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



హిందూపురం 6వ వార్డు సచివాలయంలో ఇద్దరు మాత్రమే ఉన్న కార్యదర్శులు

- మూమెంట్ రిజిస్టర్ వారికి ఆయువుపట్టు
- హాజరు సగం...సేవల్లో నిర్లక్ష్యం
- విధులకు హాజరు కాని సచివాలయ వార్డు, గ్రామ సెక్రటరీలు

ప్రజాశక్తి-హిందూపురం

పరిపాలనను గ్రామ, వార్డు స్థాయిలో విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి విభాగానికీ ఒక సెక్రటరీని నియమించింది. అయితే ఆయా సచివాయాల్లో విధులు నిర్వహించే సెక్రటరీలు మాత్రం విధులను నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయాన్నే కార్యాలయానికి రావాడం హాజరు పుస్తకంలో సంతకం పెట్టడం... అతర్వాత మూమెంట్ రిజిస్టర్‌లో క్షేత్రపరిశీల అంటు రాయడం అటునుంచే ఇళ్లకు వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. క్షేత్ర స్థాయికి ఎందుకు వెళ్లారు..? ఏమి పరిశీలించారు.? ఇలాంటి వివరాలేవీ రిజిస్టర్‌లో రాయరు. ఎవరైనా అడిగినా చెప్పరు. ఉన్నతాధికారులు సైతం ఈ విషయాలను గుర్తించలేవడం గమనార్హం.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామ సచివాలయాలు 896, గ్రామ వాలంటీర్లు 15,995, పంచాయతీ గ్రేడ్-5, కార్యదర్శులు 571 గ్రేడ్ -6 డిజిటల్ సహాయకులు 896 మహిళా పోలీసులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్, వ్యవసాయ, ఉద్యానవన, సర్వేయర్లు కలిపి దాదాపు 5,000 మంది వరకు ఉన్నారు. సచివాలయాల ద్వారా అందించాల్సిన సేవలు 540 ఉంటే ప్రస్తుతం అందుతున్న సేవలు కేవలం 50 లోపు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఒక నగర పాలక సంఘంతో పాటు 11 పురపాలక సంఘాల్లో వార్డు సచివాయాలు 311 ఉన్నాయి. ప్రతి సచివాలయంలో ప్రతి విభాగానికి ఒకరు వార్డు సెక్రటరీతో పాటు వార్డు వాలంటీర్లు ఉన్నారు. చాలా సచివాలయాల్లో సిబ్బంది వచ్చి సంతకం పెట్టి తరువాత కన్పించకుండా పోతున్నారనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. క్షేత్ర స్థాయి పరిశీలనలో ఎక్కడైనా క న్పి స్తా రా అంటే అదీకూడా లేని పరిస్థితి ఉంది. సచివాలయ వ్యవస్థ ద్వారా 540 రకాల సేవలను అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. అందులో సగం కూడా ప్రజలకు సచివాలయాల ద్వారా అందలేదు. ఇప్పటికీ కులం, ఆదాయం, మరణ, జనన వంటి ధ్రువీకరణ పత్రాలకు తహశీల్దారు కార్యాలయాలకే వెళ్లాల్సి వస్తోంది. సచివాలయంలో కేవలం డిజిటల్, అడ్మిన్ సెక్రటరీలు మాత్రమే ఉంటారు. మిగిలిన వారిని ఎవరిని అడిగి క్షేత్ర స్థాయి పరిశీలన అనే సమాధానం వస్తుంది. ప్రజలకు అవసరమైన సేవలన్నింటినీ వార్డు, గ్రామంలోనే అందించాలనే గొప్ప లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది.

సచివాలయ వ్యవస్థ తీరు హిందూపురంలో....

సచివాలయ తనఖీకి వచ్చే అధికారులు ముందస్తు సమచారం ఇస్తుండడతో ఖచ్చితంగా సిబ్బంది అంతా కనిపిస్తారు. పురపాలక సంఘం కార్యాలయానికి పక్కనే ఉన్న భవనంలో రెండు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ఏ సమయానికి వెళ్లినా పూర్తి స్థాయిలో కార్యదర్శులు కన్పించరు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రతి కార్యదర్శి అందుబాటులో ఉండి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలనే నిబంధనలు ఉన్నా పాటించడం లేదు. మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న సచివాలయం పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన వాటి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ముదిరెడ్డిపల్లిలో ఉన్న 36, 37, 38వ వార్డు సచివాలయాలు, మోత్కుపల్లి, మోడల్ కాలనీ, కొట్నూరు తదితర శివారు ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల సిబ్బంది పనితీరు పరిస్థితి మరింత అధ్వానంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా పోలీసులు అయితే వారు ఏ విధులు నిర్వహిస్తున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి ఉంది. పారిశుధ్యం, ప్లానింగ్, వెల్‌ఫేర్ ఇలా అన్ని శాఖల పరిధిలోనూ సమస్యలు పురంలో కన్పిస్తున్నాయి. కొన్ని మున్సిపాల్టీల్లో అయితే కొత్త పింఛన్ మంజూరు అయినా, పథకాలు ఏవైనా వచ్చినా సిబ్బంది లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటాం



హిందూపురం పురపాలక సంఘం వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి నోటీసులు ఇచ్చాం. కొంత మంది అధికారులను సచివాలయలకు పర్యేవేక్షణ అధికారులుగా నియమించాం. ఇకపై సచివాలయాలను ఆకస్మిక తనఖీలు నిర్వహిస్తాం. అందుబాటులో లేని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ వెంకటేశ్వరరావు,
మున్సిపల్ కమిషనర్,

నష్టాల ఊబిలో పత్తి రైతు



పామిడిలో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎఐకెఎస్ నాయకులు

- ప్రభుత్వాలు ఆదుకోవాలి
- ఎఐకెఎస్ నాయకుల డిమాండ్
- నకిలీ విత్తనాలతో నష్టపోయిన పత్తి పంట పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నకిలీ విత్తనాలు, ప్రకృతి వైపరిత్యాలతో పత్తి రైతులు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై స్పందించి వారిని ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు డిమాండ్ చేశారు. అమరవీరుల జ్యోతియాత్ర పేరుతో తెలంగాణ నుంచి చేపట్టిన యాత్ర బుధవారం అనంతపురం జిల్లాకు చేరుకుంది. పామిడి మండలంలోని గజరాంపల్లిలో పత్తి పంటను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, బిటి, నాన్‌బిటి నిష్పత్తిలోని తేడాలు మూలంగా తీరని నష్టం జరిగిందని రైతులు ఎఐకెఎస్ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. పది క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సిన చోట ఒక్క క్వింటాళు కూడా వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల రూపంలోనే ఎకరానికి రూ.50వేలు నష్టపోయినట్టు వివరించారు. దీనిపై జాతకు నాయకత్వం వహిస్తున్న కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పత్తి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు భరోసానిచ్చారు. అదే సమయంలో పత్తి రైతుల సంఖ్య ఎక్కువగా ఉండటం, వారి సమస్యలు అధికంగా ఉంటుండటంతో దేశ వ్యాప్తంగా పత్తి రైతుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఈ నెల 13 నుంచి జరిగే జాతీయ మహాసభల్లో చర్చించి నిర్ణయం చేస్తామని వివరించారు.

ఐక్యపోరాటాలే మార్గం : ఎఐకెఎస్ నాయకులు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలకు దేశ వ్యాప్తంగా రైతాంగం మరోమారు సన్నద్ధమవ్వాల్సిన అవసరముందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 13 తేది నుంచి మూడు రోజుల పాటు తిరుప్పూర్‌లో అఖిల భారత కిసాన్ సభ మహాసభలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో 'అమర వీరుల జ్యోతి యాత్ర' పేరుతో జాతలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక , తమిళనాడు, కేరళకు వెళ్లే జాత మంగళవారం తెలంగాణలో ప్రారంభమైంది. ఈ జాతా బుధవారం నాడు అనంతపురం జిల్లా పామిడికి చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పామిడి వద్ద జాతకు స్వాగతం పలికారు. పామిడి పట్టణంలో బస్టాండ్ ఆవరణం నుంచి ఎద్దువపల్లి క్రాస్ వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో జాతకు నాయకత్వం వహిస్తున్న ఎఐకెఎస్ నాయకులు కృష్ణ ప్రసాద్, నాయకులు సాగర్, ప్రకాశం మాస్టారు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ యాత్రకు సంఘీభావం తెలిపారు. పామిడి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం టి.సాగర్ మాట్లాడుతూ దేశంలో నెలకొన్న రైతాంగ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు అనుగుణంగానే మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. దేశంలోని రైతాంగం ఈ చట్టాలకు వ్యతిరేకంగా సాగించిన వీరోచిత పోరాటం మూలంగా వెనక్కు తగ్గక తప్పలేదని పేర్కొన్నారు. ఈ పోరాటంలో 750 మంది రైతులు అసవులుబాసారని తెలిపారు. వారి గుర్తుగానే ఇప్పుడు అమరవీరుల జ్యోతిజాతను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోరాట సమయంలో ఇచ్చిన కనీస మద్దతు ధర గ్యారెంటీని ఇంత వరకు కేంద్రం ఇవ్వలేదన్నారు. అదే విధంగా రైతులను వ్యవసాయ సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు రుణమాఫీ చేయాలని కోరుతున్నామని వివరించారు. రైతుల రుణమాఫీకి కేంద్రం వద్ద డబ్బుల్లేవని చెబుతుండటం చెప్పడం సరైంది కాదని అన్నారు. కార్పొరేట్ సంస్థకు రూ.11 లక్షల కోట్లు రుణమాఫీ చేసిన వారికి కోట్లాది మంది రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ చేయడం పెద్ద సమస్య కాదని అన్నారు. కనీస మద్దతు ధర, రుణమాఫీ, సమగ్రమైన పంటలబీమా కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరముందన్నారు. అందుకు ఐక్య పోరాటలే మార్గమని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతం అనేక సమస్యలు రైతులను పట్టిపీడిస్తున్నాయని చెప్పారు. జిల్లాలోనూ పత్తి,మిరప, వేరుశనగ తదతర పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయన్నారు. పత్తి పంట అవుతే నకిలీ విత్తనాల సమస్య కూడా ఉందన్నారు. పెద్దఎత్తున రైతులు నష్టపోయారని వివరించారు. ఈ రైతులను ఆదుకునే చర్యలేవి తీసుకోవడం లేదని విమర్శించారు. బీమా ద్వారానైనా ఆదుకోవాలి, లేకపోతే కంపెనీలైనా నష్ట పరిహారాన్ని చెల్లించాలన్నారు. ఇందుకు స్థానికంగానున్న రైతులందరూ ఏకమై పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, వృత్తిదారుల సంఘం నాయకులు శ్రీనివాసులు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆదాయానికి శఠగోపం..!

హుండీ లెక్కింపులో గోప్యత
వచ్చింది కొండంత.. చూపిస్తోంది గోరంత..

పజాశక్తి మడకశిర

జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి జిల్లెడగుంట ఆంజనేయస్వామి దేవాలయాల హుండీ ఆదాయం విషయంలో కొందరు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముందు నిర్వహించి హుండీ ఆదాయం లెక్కింపును అధికారులు గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. గతంలో అప్పటి అధికారులు పత్రికా ప్రకటనతో పాటు, గ్రామంలో దండోరా వేయించి గ్రామస్తులు, సీసీ కెమెరాలు, పోలీసుల పర్యవేక్షణలో, హుండీ లెక్కింపు నిర్వహించేవారు. ప్రస్తుతం ఉన్న ఈవో వచ్చినప్పటి నుంచి వీటిలో ఏ ఒక్క అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వినపడుతున్నాయి. దీంతో హుండీ లెక్కింపు జరిగి రెండు రోజుల గడిచినా ఇటు పత్రికలకు కానీ, గ్రామస్తులకు కూడా వివరాలు తెలపకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల క్రితం నిర్వహించి హుండీ లెక్కింపును సీసీ కెమెరాలు ఆఫ్ చేసి గోప్యంగా ఉంచారు. ఆ సమయంలో దాదాపు ఒకటిన్నర లక్ష రూపాయలు స్వాహా చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి.ఈ విషయంపై అప్పట్లో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై కూడా పలు అనుమానాలు రేకెత్తాయి. తాజాగా రెండు రోజుల క్రితం ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ ద్వారా దాదాపు రెండున్నర లక్షల రూపాయలు వచ్చినట్లు సమాచారం. అయితే అధికారులు మాత్రం రూ.1. 75 లక్షలు మాత్రమే వచ్చినట్లు చెబుతున్నారు. బక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం మూడు లక్షల రూపాయలకు పైగా ఉంటే కేవలం రెండు లక్షల మాత్రమే అని చెబుతుండటంపై కూడా పలు ఆరోపణలు వినపడుతున్నాయి. ఇంత బహిరంగ అవినీతికి పాల్పడుతుంటే ఉన్నతాధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి నిధులు పక్కదోవ పట్టకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. హుండీ ఆదాయం పక్కదారి పడుతుందన్న ఆరోపణలపై ఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. వాటి వివరాలు తమ అసిస్టెంట్ చెప్తాడని ఆయనను అడగాలని ఉచిత సలహా ఇచ్చారు.

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం : టిడిపి



నిరసన ర్యాలీలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వైసిపి మూడున్నర ఏళ్ల పాలనలో ఒరిగిందేమీ లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి విమర్శించారు. బుధవారం బీసీలకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఒ భాగ్యరేఖకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కురుబ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సవితమ్మ, మాజీ జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బికె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. పేరుకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే తప్ప ఏ ఒక్క దానికి నిధులు కేటాయించలేదన్నారు. వికేంద్రీకరణ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారు. గట్టిగా మాట్లాడే బీసీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. టిడిపి హయాంలో బీసీలకు అమలు చేసిన పథకాలన్నీ పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. వైసిపికి ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ నాయకులు రామాంజనేయులు, బెస్త చలపతి, గిరిధర్ గౌడ్, వడ్డే వెంకట్, సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, ఎల్ఐసి నరసింహులు, అంజినప్ప, ఆనంద్, ఈడిగ నీళ్ల రమణ, నారాయణస్వామి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల సేవలు చిరస్మరణీయం



వీరజవాను కుటుంబసభ్యుడిని సన్మానిస్తున్న కలెక్టర్

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి.పుట్టపర్తి అర్బన్

దేశానికి సేవ చేయడంలో సాయుధ దళాల సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకొని జిల్లా సైనిక సంక్షేమ శాఖకు తన వంతు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సేవలో, రక్షణలో సాయుధ దళాల సేవలు కీలకమన్నారు. మాజీ సైనికుల సంక్షేమ కోసం ప్రత్యేక నిధికి విరాళాలు ఉదారంగా అందిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో వీరమరణం పొందిన వారికి అందించే సైనిక సంక్షేమ శాఖ గోడ పత్రికలను కలెక్టర్ విడుదల చేశారు. వీరమరణం పొందిన వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి. రాచయ్య, ఆ శాఖ సిబ్బంది, వీర మరణం పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిధులున్నా పనులకు కలగని మోక్షం

ప్రారంభం కాని 'నాడు -నేడు' పనులు

ప్రజాశక్తి మడకశిర

పట్టణంలోని 8వ వార్డులో ఉన్న శివాపురం పాఠశాల అభివృద్ధికి నాడు నేడు పథకం కింద నిధులు విడుదల అయినా పనులు ప్రారంభం కాలేదు. నాడు -నేడు రెండవ విడత ద్వారా పట్టణంలోని ఎనిమిదవ వార్డులో వుంటున్న శివాపురం ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10. 99 లక్షల నిధులను నాడు నేడు పథకం కింద విడుదల చేసింది. నిధులు విడుదలై ఎనిమిది నెలలు గడచినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల మధ్య సఖ్యత లేకపోవటం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభం కాలేదన్న విమర్శలు వినపడుతున్నాయి. అయితే పనులు ప్రారంభిస్తున్నట్లు చూపిస్తూ ఇప్పటికే రూ.60 వేలు డ్రా చేసినట్లు సమాచారం. నెల క్రితం డ్రా చేసిన నిధులతో కొద్దిపాటి పునాదిరాళ్లు, ఒక టిప్పర్ కంకర పాఠశాల ఆవరణంలోకి తరలించి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. నిర్మాణం పేరుతో తరలించిన ముడి సరుకు మాత్రం నిత్యం విద్యార్థులను ఉపాధ్యాయులను వెక్కిరిస్తు కన్పింస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. పనులు ప్రారంభం కాని విషయంపై ఎంఇఒ భాస్కర్‌ను సంప్రదించగా ప్రధానోపాధ్యాయులు అనారోగ్యం పాలవటంతో వారి స్థానంలో మరో ఉపాధ్యాయునికి బాధ్యతలు అప్పగించామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



పాఠశాల వద్ద నిల్వ ఉంచిన ఇసుక, రాళ్లు

ఆక్రమణల తొలగింపు

గోరంట్ల : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుకవైపు ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహశీల్దార్ రంగనాయకులు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది జెసిబి తో పునాదులను తొలగించారు. అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

గ్రంథాలయం తనిఖీ

చెన్నేకొత్తపల్లి : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎల్ఎం ఉమాదేవి, జిల్లా కార్యదర్శి రమ బుధవారం తనిఖీ చేశారు, ఈ సందర్భంగా వారు గ్రంథాలయ నిర్వహణ రికార్డులను గ్రంథాలయానికి మంజూరైన వివిధ రకాల పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పత్రికలను జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ అధికారి జీవనకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ సిబ్బంది నాని, స్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీకాంత్

సోమందేపల్లి : సోమందేపల్లి డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గోరంట్ల ఆర్ఐగా ఇదివరకు పనిచేశారు. సోమందేపల్లికి రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రభుత్వం నియమించడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందనలు


ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తచెరువు : .రీజినల్ ఒలంపిక్స్ ఆఫ్ మ్యాథమెటిక్స్ పరీక్షలలో నారాయణ విద్యార్థులు ప్రథమ ద్వితీయ శ్రేణి ర్యాంకులు సాధించడంతో వారిని నారాయణ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటర్ గురు ప్రసాద్, ఎజిఎం రమేష్ అభినందించారు. పాఠశాలకు చెందిన చరణ్ సాయి, చరణ్ సాయి, సహస్ర, ద్వితీయ ర్యాంకు హేమంత్ నాయుడు, వైష్ణవ సాయి సాధించడంతో వారిని ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది అభినందించారు.

కెజిబివికి వంట సామగ్రి అందజేత

లేపాక్షి : మండల కేంద్రంలోని కస్తూరి బా పాఠశాలకు దాతలు వంటసామగ్రిని అందజేశారు. లేపాక్షి ఆలయంలో పనిచేసే గైడ్ రఘు, లేపాక్షికి చెందిన విశ్వనాథ్ కుమారుడు ప్రమోద్ కలసి 12 వేల రూపాయల విలువచేసే మిక్సీ, ఇతర పాత్రలను అందించారు. దీంతో దాతలకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎస్ఐ విజయ్ కుమార్, ఆర్‌డిటి ప్రతినిధులు కిష్టయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంతగా శ్రీ ఆంజనేయస్వామి విభిన్న ప్రతిభావతుల మండల సమైక్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది ఉమాదేవి నాగభూషణ, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా నామాల నాగార్జున


నామాల నాగార్జున

ధర్మవరం టౌన్ : ఎస్ఎఫ్ఐ సత్యసాయి జిల్లా నూతన అధ్యక్షుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన నామాల నాగార్జున ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో మూడు రోజుల క్రితం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లామహాసభలలో తనను ఎంపిక చేశారని నాగార్జున తెలిపారు. విద్యార్థులు సమస్యలపై నిర్విరామంగా పోరాటాలు చేస్తానని ఈసందర్భంగా నాగార్జున తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర జిల్లా నాయకులకు నాగార్జున కతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : స్థానిక ఎంపిడిఓ సమావేశం భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, డిఎం అండ్ హెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఎంపీపీ. ఏ వి రమణారెడ్డి, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్లు రెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ భానూజ, సభ్యులు లలితమ్మ , షరీఫ్ చంద్రశేఖర్ తదితరులు పారిశుధ్యంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కమ్యూనిటీ ఆధారిత సేవలపై యుఎల్‌బి కార్యనిర్వాహుకులు ఎన్నికైన సభ్యులకు, కమ్యూనిటీ ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

బత్తలపల్లి : మండలంలోని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులందరూ కృషి చేద్దామని జెడ్పీటీసీ కోటి సుధ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీవోకార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 2023-24 సంవత్సరానికి గాను అన్ని పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసేందుకు మొదటి రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణాళికల తయారీ, ప్రజా ప్రతినిధుల పాత్ర, ఆదర్శ గ్రామాలుగా ఎలా తీర్చిదిద్దేది తదితర అంశాలపైన శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సాయి మనోహర్, వైస్ ఎంపీపీలు సాకే పార్వతి, గజ్జల వెంగళరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల అధికారులు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

పుట్టపర్తి రూరల్ : మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా పుట్టపర్తి పట్టణంలో సత్యమ్మ గుడి వద్ద నుండి గణేష్ కూడలి వరకు బుధవారం టుకే రన్ ర్యాలీని నిర్వహించారు. మహిళలపై జరిగే హింస వ్యతిరేక పక్షోత్సవాల్లో భాగంగా శ్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం ,అంగన్వాడీ కార్యకర్తలు ప్లే కార్డులను ప్రదర్శించి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, నోడల్ ఆఫీసర్ గాయత్రి, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, సూపర్వైజర్లు సుజాత, పుష్ప, అనురాధ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి సాయం

కదిరి టౌన్ : పట్టణంలోని 31వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను వైసిపి రాష్ట్ర సహాయకార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ పరిష్కరించారు. వార్డులో నెలకొన్న సమస్యను వార్డు ప్రజలతో పాటు అవార్డు ఇన్‌ఛార్జి ఎస్‌కె వలి తదితరులు బత్తల హరిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన 31 వార్డులో బోరుమోటరుకు, ట్యాంకు ఏర్పాటు చేయడానికి ఆర్థిక సాయం చేశారు. ఈ నేపథ్యంలో వార్డులో బోరుమోటరును ప్రారంభించారు. దీంతో ఆ వార్డు ప్రజలు బత్తల హరిప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఖాద్రీశుని తెప్పోత్సవం

కదిరి టౌన్ : శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి తెప్పోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవరచెరువు వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రము ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అలయ కార్యనిర్వహణాధికారి పట్టెం గురుప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణ తదితరులు కోరారు.


తెప్పోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు, నాయకులు

రైతు రామయ్యకు న్యాయం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

రైతు రామయ్యకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టరకు బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోమందేపల్లి మండలం కావేటి నాగేపల్లి గ్రామానికి చెందిన పేద రైతు రామయ్య నాసిన్ సంస్థ నిర్మాణం కోసం భూసేకరణ సమయంలో తన భూమి ఇవ్వనని హైకోర్టును ఆశ్రయించాడన్నారు. అయితే నాసన్ సంస్థ ప్రతినిధులు రామయ్య కుటుంబాన్ని పోలీసులు ద్వారా నిర్బంధించి బలవంతంగా దౌర్జన్యంగా నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు హైకోర్టు ఉత్తర్వులు అమలు పరుస్తూ అక్రమ నిర్మాణ పనులను ఆపాలని తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని బాధిత రైతు హైకోర్టును ఆశ్రయించాడన్నారు. అయినా దౌర్జన్యంగా పనులు చేపడుతున్నారని తక్షణమే నిర్మాణ పనులని ఆపాలని డిమాండ్ చేశారు. రైతు రామయ్య కుటుంబానికి అండగా ఉన్న సిపిఎం నాయకులు పనులను అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించి అక్రమంగా కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ జోక్యం చేసుకుని చట్టం ప్రకారం హైకోర్టు ఉత్తర్వులను అమలు పర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ , సిఐటియు జిల్లా నాయకులు రఫీ, గౌస్ లాజం, బాబా, రాజగోపాల్, చాంద్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి నష్టం కలిగించేవారిపై చర్యలు


పల్లెకు సూచనలు చేస్తున్న చంద్రబాబు

పుట్టపర్తి రూరల్ : తెలుగుదేశం పార్టీకి నష్టం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని టీడిపి అధినేత చంద్రబాబు తనకు సూచించినట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వన్ టూ వన్ కార్యక్రమంలో భాగంగా అధినేతను తాను బుధవారం విజయవాడలో కలిసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పుట్టపర్తి గడ్డ పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడానికి అన్ని విధాల సమాయత్తం కావాలని తనకు ఈసందర్భంగా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి సంబంధించిన అంశాలను టీడీపీ అధినేత చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు. ప్రజలకు తాను అందిస్తున్న ఆర్థిక సాయంపై అధినేత తనను ప్రశంసించారని ఈసందర్భంగా పల్లె చెప్పారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి. పుట్టపర్తి అర్బన్

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం (ఎస్‌టియు) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం, ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి, డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు పొదుపు చేసుకున్న పీఎఫ్‌లో అవసరాల నిమిత్తం రుణాలు కూడా మంజూరు చేయడం లేదన్నారు. అర్హత సెలవుల నగదు, మెడికల్ బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. బోధనేతర విధుల నుండి పూర్తిగా తప్పించాలని, సిపిఎస్ ను రద్దు చేయాలని పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వీఆర్వో భాగ్యరేఖకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, హరి ప్రసాద్ రెడ్డి, ఆసిన్ ఖలీల్, నాగభూషణ, ఇనయతుల్లా, చక్రపాణి, తిప్పన్న, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అఖరిరోజులు : టిడిపి


కదిరిలో పాల్గొన్న టిడిపి నాయకులు


రొద్దం మండలంలో పాల్గొన్న టిడిపి నాయకులు

కదిరి టౌన్ : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి ఆఖరి రోజులు దగ్గరపడ్డాయని టిడిపి నాయకులు విమర్శించారు . ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక నిజాంవలి కాలనీలో 15వ వార్డ్ ఇన్‌ఛార్జి హైదర్ ఆధ్వర్యంలో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ బాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా, జావీద్, ఖాదర్ బాషా, హరి, శ్రీనివాసులు, రాజేంద్ర, దిల్దార్, హనుమంతు, బాబావలితో పాటు మహిళా నాయకులు రమణమ్మ, బుజ్జి, నసీమా, గంగరత్నమ్మ, ప్రేమలత, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని గాజులవారిపల్లి, పెద్ద తండా, నల్లగుట్ట తండా, కెబి తండాల్లో టిడిపి ఆధ్వర్యంలో బుధవారం ఇదేఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల ఇన్‌ఛార్జి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రజలను కలసి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సి కొండయ్య, సర్పంచి శివప్ప నాయుడు, మాజీ ఎంపీపీ గంగరాజు, మాజీ సర్పంచి ప్రసాద్, నాయకులు పవన్ కుమార్, ఆంజనేయులు, బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని టిడిపి నాయకులు, మాజీ జెడ్పీటీసీ రత్నమ్మ నరసింహామూర్తి విమర్శించారు. మండల. కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ నివాసం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల నూతన కమిటీలకు స్వాగతం పలుకుతూ పాత కమిటీ సభ్యులకు సన్మానం చేశారు. అనంతరం టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ శివ రుద్రప్ప, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, మీనాక్షి, రామిరెడ్డి నూతన కమిటీ సభ్యులు జయరాం, కృష్ణమూర్తి, రవికుమార్, గణేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని సానిపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతోందన్నారు. ఈ పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నిర్వాహక కార్యదర్శి సవితతో పాటు మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు చిన్నప్పయ్య, నరహరి, వెంకటరామిరెడ్డి, రామక్రిష్ణప్ప, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మడకశిర : మహాకవి యోగివేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం అధ్యక్షులు నరేష్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం రొళ్లమండలంలో పర్యటించారు. ఇక్కడి రెడ్డి కులస్తుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి వచ్చినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి కులస్తులు 12 శాతానికి పైగా ఉన్నారన్నారు. ఇందులో చాలామంది పేదరికంలో మగ్గుతున్నారని చెప్పారు. వీరిని గుర్తించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రతి సంక్షేమ పథకంలోనూ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిరుపేద రెడ్లకు భూములు పంపిణీ చేయాలన్నారు. మహాకవి యోగివేమన జయంతిని కర్నాటకలో మాదిరిగా ఇక్కడ కూడా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ నితిన్ రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, అభిషేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించిన శిక్షణ డిప్యూటీ కలెక్టర్

ప్రజాశక్తి-హిందూపురం

డిప్యూటి కలెక్టర్ శిక్షణలో భాగంగా హిందూపురం రూరల్ మండల ఎంపిడిఒగా భాధ్యతలు స్వీకరించిన మధులత బుధవారం స్థానిక పురపాలక సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుతో కలిసి పరిపాలన విధానంపై చర్చించారు. అనంతరం పురపాలక సంఘంలోని పరిపాలన, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, అకౌంట్స్, ఇంజనీరింగ్, మెప్మా విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఇన్‌ఛార్జి ఎంఇ నీరజ, టెక్నికల్ అధికారి ఆనంద్‌రాజు, ఎసిపి అనంద్‌బాబు, రెవెన్యూ అధికారి రంగారావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు రామాంజి, రాము, ఆయా శాఖల అధికారులు ఆయా విభాగంలో జరిగే పనుల గురించి వివరించారు.

మిస్టర్‌ఆంధ్ర బాడీ బిల్డింగ్‌లో సత్తా చాటాలి

ప్రజాశక్తి-హిందూపురం

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు సిద్ధం కావాలని న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ షేక్ న్యామతుల్లా పిలుపునిచ్చారు. బుధవారం హిందూపురం పట్టణంలోని కింగ్ స్టార్ జిమ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023 సంవత్సరానికి గాను బాడీ బిల్డింగ్ పోటీల్లో పురం యువకులు పోటీ చేయాలని, అందుకు బాడీ బిల్డర్లు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు షేక్ ఇమ్రాన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ షఫీవుల్లా, షేక్ రెహమాన్, అఖిల్ ఆఫ్‌తాబ్ హుస్సేన్, బాడీ బిల్డర్లు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభల పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 13నుంచి 16వరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చిస్తామన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా వ్యతిరేక విధానమైన నూతన జాతీయ విద్యా విధానంపై ఈ మహాసభలలో చర్చించి పోరాటానికి రూపకల్పన చేస్తారన్నారు. ఈ అఖిలభారత మహాసభలను విద్యార్థులు, మేధావులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భగత్, అభి, చంద్రశేఖర్, రంగ, వీరేష్, బాబా ఫక్రుద్దీన్, గురుశాంత్, మారుతి, నవీన్, రఘు, రవితేజ, భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

రెండు ఇళ్లలో చోరీ

రొద్దం : మండలంలోని ఆర్. కొట్టాల గ్రామంలో రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందిందని ఎస్ఐ నాగస్వామి తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామంలో పెనుకొండ - పావగడ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇళ్లలో దుండుగులు చోరీకి పాల్పడ్డారన్నారు. పార్వతమ్మ అనే మహిళ ఇంట్లో 4వేల రూపాయిలు నగదు, 4గ్రాములు బంగారంతో పాటు వెండి మెట్లు దొంగలించినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. అదే విధంగా మధు అనే వ్యక్తి ఇంట్లో మిరపకాయలు దొంగలించినట్లు ఫిర్యాదు అందిందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జనసేన పార్టీ నాయకులపై దాడి

గోరంట్ల : తనపై వైసీపీ నాయకులు బుధవారం పట్టణంలో గాంధీ సర్కిల్లో దాడి చేసినట్లు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గాంధీ సర్కిల్లో వైసిపి నాయకులు మేదర శంకర, బుల్లెట్‌బాబు తనపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈసందర్భంగా తనను తీవ్రంగా కొట్టారని ఆయన చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ భూమిని వైసిపి నాయకులు ఆక్రమణ చేస్తున్నారని ఈ విషయంపై రెండు రోజుల క్రితం తహశీల్దార్ కార్యాలయం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించామన్నారు. తమపైనే తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తావా అంటూ వైసిపి నాయకులు తనపై దాడి చేశారని బాధితుడు సురేష్ తెలిపారు. దాడి చేసిన విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వరుణ్ గోరంట్లకు సురేష్‌ను పరామర్శించారు నాయకులు దాడి విషయంపై చిలక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అన్యాయాలను ప్రశ్నిస్తే దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు జనసేన పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన పోరాడడానికి వెనకాడదన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిజరిగిన సంఘటనను సిఐ సుబ్బరాయుడుకు వివరించారు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

బాధితుడికి ఆర్థికసాయం

కనగానపల్లి : మండలంలోని మద్దెల చెరువు గ్రామానికి చెందిన బోయ మంత్రాల నారాయణ అనారోగ్యానికి గురై అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నారాయణను బుధవారం ఫోన్లో పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా పార్టీ నాయకుల ద్వారా నారాయణకు ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మద్దలచెరువు వైసిపి నాయకులు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

హిందూపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అనంతపురం వారి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎంజిఎం మైదానంలో ఫుట్‌బాల్ అండర్ 17 విభాగపు బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కడప జిల్లా ఎర్రగుంట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, ఎంఇఒ గంగప్ప, శ్రీ సత్యసాయి జిల్లా జిల్లా సెక్రటరీ అంజన్న, అనంతపురం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీ ముర్రార్జీ, జిల్లాలోని వివిధ పాఠశాలల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

12న వాల్మీకుల పాదయాత్ర

రొద్దం : మండలంలో వాల్మీకులు చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం రాష్ట్ర కన్వీనర్ ఈశ్వరయ్య కోరారు. ఈ నెల 12న కోగిర గ్రామం నుండి రొద్దం తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించే పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు వాల్మీకిసంఘం నాయకులు బుధవారం మండలంలోని దొడగట్ట, రెడ్డిపల్లి, గోనిమేకలపల్లి, పెద్ద గువ్వల పల్లి, గౌరాజుపల్లి, ఎం కొత్తపల్లి, మోపుర్లపల్లి తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వాల్మీకి సంఘం నాయకులు చంద్రశేఖర్, చిరంజీవి, నరసింహులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

మడకశిర రూరల్ : మండలంలోని ఆయా పాఠశాలల్లో చేపడుతున్న నాడు నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఇఒ భాస్కర్ కోరారు. పట్టణంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో ఫేస్ -2 కింద 63 పాఠశాలలో పనులు సాగుతున్నాయని అన్నారు. నాడు నేడు పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్నిచోట్ల ఇంజనీర్లు లేకపోవడంతో అరకొరగా సాగుతున్నాయని వీటి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

ఒప్పంద ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

మడకశిర : రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను తొలగించడానికి తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఉన్నఫలంగా వారిని తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన ఏ ప్రభుత్వం కూడా ఉద్యోగుల పట్ల ఇలా కక్ష సాధింపులు చేపట్టలేదని అన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : పట్టణంలోని ట్రైబల్ పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరమణ నాయక్‌ను సస్పెండ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం కదిరి ఆర్డీవో రాఘవేంద్రకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విచక్షణ రహితంగా కొట్టడమే కాకుండా విద్యార్థులను నానా దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులు భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టిప్పు సుల్తాన్, జన, పండు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

తలుపుల : మండలంలోని జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని టిడిపి, సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆయా పార్టీల అధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దుల రాముడు, హాసన్, సిద్దయ్య, ఎల్‌వి. రమణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

హిందూపురం : పట్టణంలోని మేళాపురానికి చెందిన రఫీక్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎపి ఆగ్రోస్ కార్పోరేషన్ చైర్మేన్ నవీన్ నిశ్చల్ బుధవారం తన కార్యాలయంలో మృతుని కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.